# చలి-గిలి

–పైడికొండల వెంకటేశ్వరరావు



ఎంతో ముచ్చటపడి స్వప్నని పెళ్ళి చేసుకొన్నందుకు– కొంచెంగానే అయినా – అసంతృప్తి పొందాల్సి వస్తుందని అస్సలు ఊహించలేదు రఘు.

పెళ్ళి చూపులనాడే ఆమెతో ఏకాంతంగా మాట్లాడాలని చెప్పి, వాళ్ళింటి పెరట్లోకి తీసుకెళ్ళి, అన్ని విషయాల గురించీ ఆమెతో మాట్లాడి, అన్ని విధాలా తృప్తిపడి మరీ పెళ్లికి ఒప్పుకున్నాడు.

అంతా బాగానే వుంది. అతని అభిరుచికి తగ్గట్టు ఆమె అన్ని విషయాల్లోనూ ఎంతో చలాకీగా, ఉత్సాహంగా వుంటుంది– ఒక్క 'ఆ' విషయంలో తప్ప.

ఆమె బెడ్ మీద తుళ్ళిపడే జలపాతంలా వుండాలని రఘు ఆశ. కానీ స్వప్న ఎంతో సిగ్గుగా, బిడియంగా వుంటోంది.

మామూలుగా వున్నప్పుడు గలగలా ఎన్ని కబుర్లు చెప్తుందో 'ఆ' విషయాలు కదిపితే అంతలో ముడుచుకు పోతుంది!

అలా అని బెడ్‌మీద మరీ ముభావంగా వుంటుందా అంటే అదీకాదు: అతను కదిపి, కదిలించి, రెచ్చగొడితే అప్పుడు... ఆ మైకంలో ఆమెలో ఉత్సాహం పొంగులెత్తిపోతుంది.

కానీ, పెళ్ళయిన ఈ అయిదు నెలల్లోనూ ఆమె కనీసం ఒక్కసారి కూడా తనకి తానుగా తన కోరిక బయట పెట్టలేదు. తనకి తానుగా ఎప్పుడూ చొరవ తీసుకోలేదు.

తనతో సమానంగా– ఒక్కోసారి తనకంటే ఎక్కువ ఉత్సాహంగా, చొరవగా– ఆమె తనతో బెడ్ షేర్ చేసుకోవాలని రఘు కోరిక.

ఎలా తీరుతుంది ఆ కోరిక?

ఎలా? ఎలా? ఎలా?

* * *

చెంపలకి వేడిగా తాకుతోన్న ఊపిరికి అకస్మాత్తుగా మెలకువొచ్చింది స్వప్నకి.

మత్తుగా కళ్ళు తెరచి చూసి ఆశ్చర్యపోయింది. తన చేతులు రఘు చుట్టూ పెనవేసి వున్నాయి.

తామిద్దరూ, గాలి కూడా చొరబడ్డానికి వీల్లేనంతా దగ్గరగా, పెనవేసుకుపోయి వున్నారు. ఒంటి మీద బట్టలు అస్తవ్యస్తంగా చెదిరిపోయి వున్నాయి.

ఇప్పుడు అతని ఊపిరి వెచ్చగా ఆమె మెడని తాకుతోంది.

అప్రయత్నంగా ఆమె చేతులు అతని వీపు మీద మరింతగా బిగుసుకున్నాయి. అతన్ని మరింతగా దగ్గరకి లాక్కోవాలన్న ఆమె కోరిక తీరకపోగా క్షణక్షణానికీ ఉధృతమవుతోంది.

హఠాత్తుగా ఒంటిమీద నుండి నైటీ పూర్తిగా తొలగిపోవడంతో అతని చేతులు ఆమె ఒంటికి గిలిగింతలు పుట్టిస్తున్నాయి.

ఆమె అణువణువూ అతని శరీరాన్ని తాకుతోన్నా ఇంకా అతనికి దగ్గరవ్వాలని ప్రయత్నిస్తోందామె.

నాలుగు క్షణాల తర్వాత...

ఒకే క్షణంలో రెండు జలపాతాలు తనమీద పడ్డట్టు ఉక్కిరిబిక్కిరై పోసాగింది బెడ్.

మరో అయిదు నిమిషాలకి గానీ అది తెరిపిన పడలేకపోయింది. తీరా తెరిపిన పడ్డాక "ఇందాకే బావుంది. ఇప్పుడేం వుంది" అని

బాధ పడసాగింది.

ఎప్పుడూ లేంది తనంత చొరవ ఎందుకు తీసుకుందో, మోహం, ఆవేశం, వేగం, తన లోకి ఎలా వచ్చాయో, తన ప్రవర్తనకి అతను ఎలా ఫీలవుతున్నాడో అని కంగారు పడసాగింది స్వప్న.

తృప్తిగా ఆమె నుంచి పక్కకి జరిగి, మళ్ళీ ఆమె దగ్గరగా జరిగి ఆమె పెదవులపై ముద్దు పెట్టుకుని "థాంక్యూ స్వప్నా! మంచమ్మీద నువ్వు యాక్టివ్ పార్ట్ తీసుకోవాలనీ, నీకు నువ్వుగా నన్ను కదపాలనీ, ఇద్దరం ఒకే వేగంతో కలిసి పోవాలనీ, ఇద్దర్లోనూ ఒకే దాహం, ఒకే తృప్తీ నిండాలనీ నా కోరిక ఇన్నాళ్ళకి తీరింది. మొత్తానికి నా ప్లాన్ పనిచేసింది" అన్నాడు రఘు.

అతనన్న చివరిమాట దగ్గరే ఆగిపోయాయి ఆమె ఆలోచనలన్నీ. ఏమిటతని ప్లాన్?

అడుగుదామని నోరు తెరిచేసరికి, అతను పక్కకి తిరిగి కళ్ళు మూసుకుని కనిపించాడు.

ఏమిటా ప్లాన్?

ఏమిటి? ఏమిటి? ఏమిటి?

* * *

"రాత్రి ఏదో ప్లాన్ అన్నారు ఏంటది?" బిడియంగా అతని కళ్లలోకి చూస్తూ అడిగింది స్వప్న.

"రాత్రా?" నుదురు చిట్లించి అన్నాడు రఘు.

"అదే. తెల్లవారు ఝామున..." అర్థోక్తిగా ఆగి అంది.

"అదా! సారీ! చెప్పను. అది చెప్పేస్తే నువ్వు మామూలై పోతావ్. నాకు నువ్వు తెల్లవారు ఝామున ప్రవర్తించినట్టు ప్రవర్తిస్తే ఎంతో తృప్తిగా, సంతోషంగా వుంటుంది".

"మీకంత సంతోషం కలిగించే పనైతే నేను మాత్రం ఎందుకు చెయ్యను? ఇకనుంచీ మీకిష్టం వచ్చినట్టే వుంటాను గానీ ఆ రహస్యమేంటో చెప్పండి ప్లీజ్!"

"నిజంగా ఎప్పుడూ అలాగే వుంటావా?"

"ఉ! ప్రామిస్".

"ఒ.కే! అయితే, ఆ ప్లానేంటో చెప్పేస్తున్నాను...చలికాలపు తెల్లవారు ఝాము చలికి, ఫుల్ స్పీడ్‌లో వున్న ఫ్యాన్ గాలి తోడైనప్పుడు, కప్పుకున్న దుప్పటిని మెల్మెదిగా లాగి పక్కకి విసిరేస్తే, చలికి తట్టుకోలేక నువ్వు నన్ను చుట్టేసుకుంటుంటే......"అతనలా చెప్పుకుపోతుంటే....

ఆమె కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవవ్వసాగాయి.

# తల్లి ముంగిట

మురికి మోరీల్ని ఎండిన తటాకాల్నీ చూసిచూసి ఉన్నోళ్లం
బీడు భూముల్ని హరితం చేయలేని మట్టి మనుషులం
ఉరక లేస్తున్న నదుల్ని ఏపుగా పెరుగుతున్న పచ్చటి పొలాల్నీ
అమితాశ్చర్యంగా వీక్షిస్తూభీమ్లీ సముద్రతీరం చేరాం
చిన్నప్పుడు కాకతీయ కాలవలో ఈదొచ్చినప్పుడు
ఉగ్ర గంభీరంగాకన్పించిన అమ్మ మోము
మదిలో కదలాడినట్లయింది–
బిడ్డ కనిపించని గోమాత అదువుతప్పి
ఉద్రేక ఉద్వేగంలో రంకె లేస్తూ ఉరుకుతున్నట్లుంది–
బిత్తర బిత్తరగా దూరం నుంచీ చూస్తూ నిలబడ్డాం
కెరటాలు విరిగి పాయలై చిన్నప్పటి మిత్రుల్లా
పాదాలను పలకరించి ఆటాడుకుందాం రా రమ్మన్నాయి
ఉధృతంగా లయాత్మకంగా ఊగితూగే అలల మెట్ల సౌందర్యం
మట్టిని మించిన సముద్రపు పరిమళం
మమ్మల్ని పోరగాళ్ళని చేసేసాయి
అంతే ! లాగూ చొక్కాలు ఊడబెరుక్కుని
ఒడ్డుకు కూర్చున్న ముసిలవ్వల మీదికి విసిరేశాం
ఎండ్ర కిచ్చల మాదిరి జర జర పరుగులు తీశాం
అంబా అంబా అంటూ లేగదూడలై ఛెంగు ఛెంగుమన్నాం
గగనాన ఎగిసే కొంగల మాదిరి హృదయాలు ఎటెటో ఎగిరిపోయాయి
కుక్క కూనల్లా ఒకరి మీద ఒకరుపడి కరుచుకున్నాం
మట్టీ గిట్టీ అని చూడక కుర్మాల్లా పొర్లాడాం
బురదిపికలతో ఉప్ప జలాల్తోహోలీ సంబరం చేసుకున్నాం
బంజారాల్లా గుండ్రంగా గుమిగూడాం
కూతల్తో కేకల్తో అంబరాన్నే అంటించుకున్నాం
అందరికీ అందరం గాన గార్దభాలయ్యాం
వానరమూకలమై నృత్య భంగిమల్ని ఛిన్నాభిన్నం చేశాం
మాతోటి ఆడాళ్ళంతా మాకు అక్కలవ్వలే అయ్యారు
బరిబాత్‌ల వాళ్ళముందు ఎన్నెన్ని కుప్పిగంతులలో
దేహంనిండా బట్టలున్నా ఆఫీసులో వందొకర్లు పోయేటోళ్ళం
వాళ్ళూఅంతే అబ్బయ్యల ముందు గెంతే పోరల్లా
చిన్నప్పటి చేష్టల్లోకి పరకాయ ప్రవేశాలు చేశారు
ఒకటే లొల్లిలొల్లి... ...జాతర జాతర
తల్లి అడవి కోపంతో ఒక కెరటాన్ని విసిరి కొట్టింది
దూరంగా నిల్చున్న టచ్‌మీ నాట్ గాళ్ళని ముసిలోల్లని దెబ్బకు కడిగి పారేసింది
ఒడ్డునున్న వస్త్రాల్ని సైతం లోనికి లాక్కు పోయింది
గంగార్పణం అని సర్ది చెప్పుకున్నాం
అలా,అమ్మ సముద్రపు అలల కొంగు పట్టుకుని
ఆడి ఆడి ఆమె ఒడిలో ప్రపంచాన్నే మరచి
నిజంగా జీవించాం సంతుష్ట సమాధిని చేరాం
అలసి అలసి శవాసనాల్లో పరుండీ పరుండీ
ఇసుక తిన్నెల మీదికి చేరాక
హోరులో కడలి తల్లి ఇలా చెపుతున్నట్లుంది
'అనుభూతికి హృదయం చాలదు
అనుభవానికి శరీరం చాలదు'

–రహమతుల్లా